## క్లుప్తంగా

### ఇంటి వద్దకే వైద్య సేవలు



బొమ్మవరం గ్రామంలో రోగులకు ఇంటి వద్దనే వైద్యం అందిస్తున్న డాక్టర్ రాజశేఖర్

**ఓబులవారిపల్లె :** ఫ్యామిలీ డాక్టర్ ద్వార గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు ఇంటి వద్దనే ఉచిత వైద్యం అందిస్తున్నామని డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం బొమ్మవరం సచివాలయ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి రాలేక ఇంటి వద్దనే ఉంటున్న దీర్ఘకాలిక రోగులకు, వృద్ధులకు వారి ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందిచి వైద్య సలహాలను ఇస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

### సమతుల ఆహారంతోనే ఆరోగ్యం

**రాయచోటి టౌన్ :** చిన్న పిల్లలు సమతుల ఆహారంతోనే ఆరోగ్యంగా ఎదుగుతారని చిన్న పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ టి.స్వాతిరెడ్డి అన్నారు. జాతీయ పోషకాహార వారోత్సవాలలో భాగంగా శుక్రవారం వెంకటేశ్వర హాస్పిటల్, సన్‌రైజ్ స్కూల్ వారి ఆధ్వర్యంలో 370 మంది చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో పోషకాహార లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి కావాల్సిన విద్యార్థులకు మందులు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ జబిన్ తాజ్, సిబ్బంది అఖిల వేద, రెడ్డి బాబు, సన్‌రైజ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ సుధాకర‌రెడ్డి, ప్రిన్సిపల్ చిత్ర తదితరులు పాల్గొన్నారు.

### యువకుడి వైద్యానికి ఆర్థిక సహాయం



చెక్కును అందిస్తున్న సాయివికాస్‌రెడ్డి

**ఓబులవారిపల్లె :** అయ్యలరాజుపల్లె గ్రామానికి చెందిన వంకన శ్రీకాంత్‌రెడ్డి చేయి ఆపరేషన్‌కు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వార వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం ముక్కావారిపల్లె ఆయన క్యాంపు కార్యాలయంలో చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరవ శ్రీధర్, సీనియర్ నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టిక ఆహారం పంపిణీ

**పుల్లంపేట :** రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ సెంటర్ ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం కొత్తపేట సచివాలయంలో పౌష్టిక ఆహార మాసోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నిర్మలదేవి ఆధ్వర్యంలో పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తపేట సర్పంచ్ మణికంఠ, ఉపసర్పంచ్ సుబ్బరాజు, పంచాయతీ కార్యదర్శి గిరి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నందలూరు(రాజంపేట) :** రాజంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని లెబాకా సెక్టార్ పరిధిలోని ఈడిగపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ వై. సూజామని, సూపర్‌వైజర్ జె. శంకరమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఎంపీపీ స్కూల్ హెచ్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

### పేదల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష

**పుల్లంపేట :** జగనన్న ఆరోగ్య సురక్ష పథకం క్రింద ప్రతి ఇంటికి వెళ్లి అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి ఉచితంగా వారికి వైద్య సేవలు అందించాలని పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సానే శేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ఈనెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గ్రామాలలో వలంటీర్లు ద్వారా అనారోగ్యంతో ఉన్నవారిని గుర్తించి విలేజ్‌క్లినిక్‌లలో ఉచితంగా వైద్యసేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహకుమార్, ఎంపీడీఓ రఘురాం, డాక్టర్ సానేశేఖర్, డాక్టర్ మనోజ్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలి

**సంబేపల్లె :** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి పని కల్పించడమే పథకం ఉద్దేశమని ఎంపీపీ ఆవుల నాగ శ్రీలక్ష్మి తెలిపారు. డ్వామా పీడీ మద్దిలేటి, ఏపీడీ ప్రతాప్‌లు ఉపాధి హామీ పథకం కింద 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 8.28 కోట్లతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలో గ్రామాలలో జరిగిన పనులపై డీఆర్‌పీలను చదివి వినిపించారు. ఉపాధిలో వివిధ గ్రామాలలో చిన్నచిన్న తప్పిదాలు తప్ప పనులన్నీ సక్రమంగా జరిగాయన్నారు. రూ. 31220 అవినీతి జరిగినట్లు తెలియజేశారు. అందులో రూ. 22 వేలు రికవరీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హత ఉంటే ఇళ్ల ముంగిటకే పథకాలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



పథకాలు ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



సీసీరోడ్ల ప్రారంభంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, నాయకులు

**లక్కిరెడ్డిపల్లి :** ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించడమే తన లక్ష్యమని వైఎస్సార్ సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలం, మద్దిరేవుల గ్రామ పంచాయతీలో ఉదయం 6.30 గంటలకే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, ఉపసర్పంచ్ సంజీవరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. మద్దిరేవుల గ్రామంలోని జీఎంఆర్ కాలనీ, మార్లవాండ్లపల్లె, బిల్డింగ్ హరిజనవాడ, కొత్త మాదిగపల్లె, గడ్డక్రింద హరిజనవాడ, అప్పలరాజుగారిపల్లెలోని ఈడిగపల్లె, సోమలవాండ్లపల్లె, వంకగడ్డ రాచపల్లి, పాత మాదిగపల్లె, సింగంరాజుగారిపల్లె, రెడ్డివారిపల్లెలలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నాలుగేళ్ల పాలనలో ప్రతి ఇంటికి వేలాది, లక్షలాది రూపాయలు లబ్ధి పొందడం జరిగిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి పాలనను ప్రజల చెంతకు చేర్చడం జరిగిందన్నారు. అర్హత ఉండి ఇళ్లు రానివారికి ఇళ్లను మంజూరు చేయిస్తామన్నారు.

**దళితోద్ధారకుడు సీఎం జగన్**

దళితోద్ధారకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని మద్దిరేవుల దళితవాడ ప్రజలు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఎదుట స్పష్టం చేశారు. దళితవాడలలో శ్రీకాంత్ రెడ్డికి ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు లభించాయి. ఆయా గ్రామాల్లో దళిత మహిళలు, ప్రజలు కర్పూర హారతులు పట్టి గజమాలలు వేసి ఆత్మీయంగా తమ ఇళ్లవద్దకు ఆహ్వానించారు. జగనన్న పాలనలో తమకు నేరుగా ఎవరి సిఫారసు లేకుండానే సంక్షేమ పథకాలు అందుతున్నాయని, దళితుల సంక్షేమం, అభివృద్ధికి జగన్ మోహన్ రెడ్డి చిత్తశుద్ధ/ తో కృషిచేస్తూ దళితుల పక్షపాటిగా పేరొందారని వారు శ్రీకాంత్ రెడ్డి ఎదుట హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, నరసింహారెడ్డి, ఎంపీటీసీలు లక్ష్మీనారాయణ, జగన్‌మోహన్ రెడ్డి, సుబ్బరాయుడు, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, సిద్ధక నాగిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్‌లు దేవేంద్రరెడ్డి, రామచంద్రయ్య, కొండా ప్రసాద్ రెడ్డి, ఉప సర్పంచ్‌లు సంజీవరెడ్డి, వేమిరెడ్డి, రాజారెడ్డి, వైఎస్సార్ సిపి నాయకులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాల అభివృద్ధే ధ్యేయం**

నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధే తమ ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవుల గ్రామంలోని రూ. 1 కోట్లతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన బండపల్లె హరిజనవాడ నుంచి సింగమరాజుగారిపల్లె వరకు తారురోడ్డును, రూ. 62 లక్షల ఈఏపీ నిధులతో మద్దిరేవుల రెడివారిపల్లె నుంచి సింగమరాజుగారిపల్లెకు సిసి రోడ్డు, రూ. 6 లక్షలతో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన జీఎంఆర్ కాలనీ నందు నిర్మించిన సిమెంట్ రోడ్డు నిర్మాణాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

**రైతులకు విజ్ఞాన కేంద్రాలుగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు**

జగన్ ప్రభుత్వం రైతు ముంగిటకే ప్రభుత్వ సేవలను అందిస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవులలో నూతన నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నారన్నారు. ఇందులో భాగంగా గ్రామాలలో రైతుల ముంగిటకు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించేందుకు వీలుగా రైతు భరోసా కేంద్రాలను తీసుకొచ్చామన్నారు. రైతులకు విజ్ఞాన కేంద్రాలుగా ఉన్న రైతు భరోసా కేంద్రాలను ప్రతి ఒక రైతు సద్వినియోగం చేసుకొని సేవలు పొందాలని కోరారు. అదే గ్రామంలో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలకు స్థలాన్ని ఇచ్చిన దాత కీ.శే బాల స్వామి దాసు, జాల ప్రభు కుమార్, కీ.శే జాల దివాకర్, జాల సామ్‌సన్ సురేష్ బాబు, వారి కుటుంబ సభ్యులను శ్రీకాంత్ రెడ్డి అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆర్ అండ్ బీ అధికారులు, వివిధ శాఖల మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**సిద్దవటం :** మండలంలోని 33/11 కేవీ సిద్దవటం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ జయచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతులు చేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

### విద్యార్థులకు అతిథి భోజనం

**పుల్లంపేట :** మండల పరిధిలోని అనంతంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాని జ్ఞాపకార్థం విద్యార్థులకు అతిథి భోజనం వడ్డించారు. అదే పాఠశాలలో 9వ తరగతి వరకు చదివిన నాని అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లిదండ్రులు తమ కుమారుడి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది పాఠశాలలో విద్యార్థులకు అతిథి భోజనం వడ్డిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందజేశారు.

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు



రాయచోటి టౌన్: ప్రత్యేక అలంకరణలో భద్రకాళి

**సిద్దవటం/రాయచోటి టౌన్/చిట్వేలి:** రాయచోటి, చిట్వేలి మండల కేంద్రంలోని భద్రకాళి ఆలయాల్లో ప్రత్యేక పూజలతోపాటు రాహుకాల పూజలు చేశారు. అలానే సిద్దవటం మండల పరిధిలోని బంగారు పేట గ్రామ శివారులో వెలసిన గంగాభవాని అమ్మవారిని శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని విశేషంగా అలంకరించారు.

# ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి



సంబేపల్లె: ఉలవలను పంపిణీ చేస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి



రాయచోటి టౌన్: ఉలవలను అందజేస్తున్న దృశ్యం

**సంబేపల్లె :** ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు ప్రధాన పంటైన వేరుశనగ పంట ఆశించిన మేర సాగు కాకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద రాయితీపై ఉలవలను ఆయన రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటలైన అలసంద, అనప, పెసర, ఉలవ తదితర పంటలను తక్కువ పెట్టుబడితో సాగుచేస్తే రైతులు లాభాలు పొందవచ్చన్నారు. ఉలవలను రైతులకు 80శాతం రాయితీతో రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. మండలానికి 533.25 క్వింటాళ్ల ఉలవలు మంజూరయ్యాయన్నారు. కావాల్సిన రైతులు ఆయా గ్రామాల ఆర్‌బీకేలలో ఉలవలను తీసుకోవచ్చని తెలిపారు. రైతులు సాగుచేసిన పంటలను ఈ-క్రాప్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగలక్ష్మి, నాయకుడు రమేష్ రెడ్డి, మండల వ్యవసాయ చైర్మన్ వాసుదేవరెడ్డి, ఏఓ కిషోర్ నాయక్, రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

**80 శాతం సబ్సిడీతో..**

**రాయచోటి టౌన్ :** 2023 ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులలో పంటలు సాగు చేయని రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలవ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు రాయచోటి ఏఓ దివాకర్ తెలిపారు. శుక్రవారం రాయచోటి రూరల్ పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామ సచివాలయం వద్ద రైతులకు వీటిని అందజేశారు. ఏడీఏ శ్రీలత, బీసీ నాయకులు పల్లపు రమేష్ మాట్లాడుతూ 10 కిలోల బస్తా సాధారణ ధర రూ.1080లు కాగా రైతు వాటా రూ. 216 మాత్రమే చెల్లించాలని ప్రభుత్వం సబ్సిడీ రూ.864లను భరిస్తుందన్నారు. ప్రతి గ్రామ సచివాలయం వద్ద ఆయా గ్రామాలకు చెందిన రైతులు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్‌రెడ్డి, ఏఓ దివాకర్, వైఎస్సార్ సీపీ నాయకుడు తిరుపాల్ నాయుడు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

**రైల్వేకోడూరు :** అన్ని రంగాల్లో అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కె.బుడుగుంటపల్లి పంచాయతీలోని సమతానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే కొరముట్ల అందరినీ ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల్ని వివరించారు. నాలుగేళ్ల పాలనలో ఏమి చేసింది.. ఇంకా ఏమి కావాలో అడిగి తెలుసుకున్నారు. ఓట్లేసి గెలిపించిన నేతలే ఇంటి ముంగిటకే వచ్చి అడుగుతుండటంతో ప్రజల కళ్లల్లో సంతోషం వెల్లివెరిసింది. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందోన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాల్ని ప్రజలకు అందిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణ పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ప్రజలు బాసటగా నిలవాలని కోరారు. ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలు అవాస్తవాల్ని ప్రచారం చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నాయని, వాటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విధ్వంసకాండ సృష్టిస్తున్న చంద్రబాబును, టీడీపీని రానున్న ఎన్నికల్లో బాయ్‌కాట్ చేయాలని కోరారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు గత నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం కోట్లాది రుపాయలు ఖర్చు చేసిందన్నారు. ఇటువంటి సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని కోరారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా ప్రజల ఆశీస్సులతో 2024లో కూడా వైఎస్సార్‌సీపీ అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ యజ్ఞం చంద్రశేఖర్, ఏపీటీడీసీ డైరెక్టర్ నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, డైరెక్టర్ గునిశెట్టి ప్రశాంతి, జెట్పీటీసీ రత్నమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, తోట శివసాయి, బత్తల సుబ్రమణ్యం, రామక్రిష్ణయ్య, గోపి, సూరిబాబులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా ఎస్జీఎఫ్ ఆటల పోటీలు



చిట్వేలి: కబడ్డీ ఆడుతున్న బాలికలు

**చిట్వేలి :** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి ఆటల పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఏబీఎన్ ప్రసాద్ మాట్లాడుతూ పోటీలలో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను అభినందించారు. అలాగే నియోజకవర్గ స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపి పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. వ్యాయామ ఉపాధ్యాయులు షబ్బీర్ అహ్మద్, సుభాషిణీలు పోటీలలో పాఠశాల పేరు నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో పీడీలు చిట్టిబాబు, ప్రమీల, రుక్సానా, ఉపాధ్యాయులు రాజశేఖర్, బాలరాజు, దుర్గరాజు, సుభాష్ చంద్రబోస్, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

**సంబేపల్లె :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గత రెండు రోజులుగా నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. మండల స్థాయిలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పాఠశాల స్థాయిలో తొమ్మిది క్రీడల్లో అండర్-14, అండర్-17 విభాగాలలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు ఉంటాయని క్రీడా కన్వీనర్లు సురేంద్రరాజు, అమరనాథరెడ్డిలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సోమశేఖర్ రెడ్డి, సునీత, హేమలత, షామీర్, ఉపాధ్యాయులు భాస్కర్, చక్రపాణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

**పెనగలూరు :** మండలస్థాయి ఆటలు పోటీలు శుక్రవారం పెనగలూరు హైస్కూల్ గ్రౌండ్‌లో నువ్వా నేనా అన్నట్లు సాగాయి. ఈ ఆటల పోటీలను ఎంఈఓ గిరివరదయ్య, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డిలు ప్రారంభించారు. అండర్-14, అండర్-17 విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించినట్లు ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రణవి తెలిపారు. తొమ్మిది విభాగాల్లో పోటీలను నిర్వహించినట్లు ఆమె తెలిపారు. మండలస్థాయిలో ఎంపికై న విద్యార్థులను నియోజకవర్గ స్థాయిలో ఆడనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుచ్చకాయల ఎల్లయ్య, వెంకటసుబ్బయ్య, రాఘవ రెడ్డి, అనీల్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విజ్ఞాన జ్యోతికి ఎంపికైన విద్యార్థులు



విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన దృశ్యం

**నందలూరు (రాజంపేట) :** బాలికల్లో శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన విజ్ఞాన జ్యోతి కార్యక్రమానికి స్థానిక జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో భాగంగా పదోతరగతి నుంచి 50 మంది విద్యార్థినులు, 12వ తరగతి నుంచి 33 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. విద్యార్థినులకు నిపుణుల చేత ప్రత్యేక తరగతులు, సైన్స్ విజ్ఞాన యాత్రలు, ఒక్కొక్కరికి జేఈఈ మెయిన్స్, నీట్‌కు సంబంధించిన రూ. 8వేలు విలువగల ప్రత్యేక స్టడీ మెటీరియల్ పుస్తకాలు, దాంతో పాటు 12వ తరగతి విద్యార్థినులకు నెలకు రూ. 1000లు ఉపకార వేతనం ఇవ్వనున్నారు. విజ్ఞాన జ్యోతి కార్యక్రమాన్ని పేస్ సెట్టింగ్‌లో భాగంగా రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, సీనియర్ ఇంటర్ విద్యార్థునులకు 6 మందికి, నెల్లూరు జిల్లా నవోదయ 12వ తరగతి విద్యార్థినులు 12 మందికి, ఆకేపాటి ప్రభుత్వ పాఠశాల 10వ తరగతి విద్యార్థినులు 8 మందికి, కేంద్రీయ విద్యాలయం రాజంపేట పదోతరగతి విద్యార్థునులు 12 మందికి ఈ అవకాశం కల్పించినట్లు జవహర్ నవోదయ విద్యాలయ ప్రాచార్యులు గీత తెలియజేశారు.

# నంద్యాల జిల్లా బీజేపీ ఇన్‌చార్జిగా రమేష్‌నాయుడు

**రాజంపేట టౌన్ :** భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా ఇన్‌చార్జిగా రాజంపేటకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు పోతుగుంట రమేష్‌నాయుడును నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని రమేష్‌నాయుడు శుక్రవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. తాను పార్టీకి చేస్తున్న సేవలకు గుర్తింపుగా తనకు తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అదనంగా నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పచెప్పినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఆయన రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు.

### నేడు పెనగలూరులో ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం

**పెనగలూరు :** మండల కేంద్రంలో నియోజకవర్గస్థాయి ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల శివకుమార్ తెలిపారు. కోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరులో ఉన్న ముదిరాజ్‌లు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనాలని వారు కోరారు. ఈ సమ్మేళనం పార్టీలకతీతంగా నియోజకవర్గంలోని ముదిరాజ్‌లతో జరుపనున్నట్లు వారు తెలిపారు. ముదిరాజ్‌లసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

### ప్రతి ఒక్కరిలో భక్తిభావం పెంపొందాలి

**రామాపురం :** మండలంలోని కల్పనాయినిచెరువు గ్రామం ఊరమాదిగపల్లిలో రామాలయం నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ రామాలయం నిర్మాణంకు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి దేవాదాయ శాఖ నుంచి రూ. 10లక్షలు నిధులు మంజూరు చేయించడం సంతోషంగా ఉందని, తన వంతు సహాయంగా రూ. 1లక్ష ఇస్తానని ఆలయ నిర్వాహకులకు తెలియజేశారు. కంకర్ మిషన్ చంద్ర ఆలయం నిర్మాణంకు సిమెంటు, కడ్డీలు అందిస్తానని, గంగిరెడ్డి స్థలం అవసరమైతే తన సొంత పొలంలో స్థలాన్ని ఇస్తానని సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గడికోట ప్రభాకర్‌రెడ్డి, కంకర్ మిషన్ చంద్ర, గంగిరెడ్డి, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, రమేష్, పొట్టి చెన్నారెడ్డి, శ్రీను, రామాంజులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### తప్పులు లేకుండా నివేదికను ఇవ్వాలి

**పెనగలూరు :** తీసివేసిన ఓటర్ల జాబితా తుది నివేదికను బీఎల్‌ఓలు అందజేయాలని తహసీల్దార్ శ్రీధర్ రావు కోరారు. శుక్రవారం సాయంత్రం బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు వారు పంపిన జాబితా ప్రకారం సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుండా తుది నివేదిక ఇవ్వాలని ఆయన తెలిపారు. ప్రతి ఓటరు ఇంటివద్దకు వెళ్లి ఆ జాబితాను పరిశీలించి అక్కడ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా జాబితాను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

### విద్యతోనే అభివృద్ధి సాధ్యం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**సంబేపల్లె :** మానవ ప్రగతికి అక్షరాస్యత తప్పనిసరి అని ప్రధానోపాధ్యాయురాలు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శంకరయ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ నిరక్షరాస్యులు దృష్టిని విద్యవైపు మళ్లించి, వారికి ఉండే సాంఘిక హక్కులు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకునేలా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శంకరయ్య మాట్లాడుతూ అక్షరాస్యత అనేది కుటుంబ స్థితిగతులను మెరుగుపరుస్తుందని, దాంతో దేశ ప్రగతి త్వరితగతిన జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్లకార్డులు, నినాదాలు పలువురిని ఆకర్షించాయి.

### ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

**రామాపురం :** శ్రీ కేవలానంద లక్ష్మిణార్యస్వామిజీ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజులు పాటు త్రయాహ్నిక దీక్షాపూర్వకంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బి.రాచపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన మందిరంలో స్వామిజీ విగ్రహ ప్రతిష్టను మల్లిరెడ్డి వంశానికి చెందిన రాజారెడ్డి శ్రీమతి కుళ్లాయమ్మ దంపతులు నిర్వహిస్తున్నారు. ఉదయం మహాగణపతి పూజ, స్వస్తిఃపుణ్యాహావాచనం, మాతృకాపూజ, కలశ స్థాపన, మంటపారాధన, అగ్ని ప్రతిష్టాపన అంకుర్పాణ, అభిషేకాలు సాయంత్రం జలాధివాస పూజలు నిర్వహించారు.